# అర్హత

స్వర్గానికి వెళ్ళినా సవతి పోరు తప్పదట! నా పాలిటి కట్లాగే దాపురించాడు సిద్ధముని. తుమ్మ బంకలా తగులుకున్నాడు. దులిపేసినా వదిలిపెట్టడు. తన ధోరణే తనది! ఇంతకూ అతణ్ణని ఏం లాభం? పొరబాటు మా ఆవిడది? ఇతడు పనిగట్టుకుని వెళ్ళి నన్ను గురించి వాకబు చేశాడనే అనుకుందాం. ఇంట్లో లేరు. ఎక్కడికి వెళ్ళారో తెలియదు, ఎప్పుడొస్తారో చెప్పలేను అని చెప్పి వుండొచ్చు గదా! సత్యహరిశ్చంద్రుడి తోబుట్టువులా ఒక్కక్షరం పొల్లుబోకుండా నా అడ్రసు చెప్పి మా రాణీసాహేబా ఇతణ్ణి నాపైకి తోలింది. ఇంకేం! ఇతగాడు రెక్కలు గట్టుకున్నట్టుగా వచ్చి నా దగ్గర వాలిపోయాడు.

"ఇంటికెళ్ళొస్తున్నా! ఇక్కడున్నట్టు తెలిసింది. అన్నట్టిక్కడేదో మీటింగట కదూ? ఏం మీటింగో? ఏ పార్టీవాళ్ళది?" అంటూ ప్రక్కనే సిమెంటు బెంచీపైన బైటాయించాడు.

మాలావు కోపం వచ్చింది నాకు! "ఇదొక పీడైపోయింది. కూచున్నా, లేచినా, బతికినా, చచ్చినా, ఏం జరిగినా రాజకీయమే! అసలు రాజకీయాలతోనే దేశం ఇంత నామర్దా స్థితికొచ్చేసింది. ఇదేం రాజకీయ పార్టీ మీటింగు కాదు. వట్టి ప్యూర్ ఆర్ట్! అప్పటమైన కళ అన్నమాట! అదీ సంగతి" అన్నాను.

సిద్ధమునికి 'కళ' అంటే ఏమిటో తెలిసినట్టు లేదు. నిజమే పాపం! అందును గురించి తెలుసుకునే అవకాశం లేదని చెప్పడం మరీ సబబు. అతడు పుట్టిందీ పెరిగిందీ ఇప్పుడున్నదీ చివరకు గిట్టబోయేదీగూడా పల్లెటూరే! గడ్డీగాదం, ఎరువు దిబ్బలు, కాలిబాటలూ, ముళ్ళకంచెలు, మట్టి పంచలూ, రచ్చపట్లు, రాంభజనలు తప్పితే మరేముంటుంది పల్లెల్లో. అందుకే నాగరికులైన వాళ్ళు వాటి ముఖం చూడడం ఎన్నడో మానేశారు. సిద్ధమునిలాంటి పల్లెటూళ్ళ వాళ్ళు మాత్రం ఎందుకో ఒకందుకు బట్టలు, ఎరువులు, కచేరీపన్లు, బ్యాంకులోన్లు మొదలైన వాటికోసం వచ్చి పట్నంలో దిగబడిపోతుంటారు. మిగిలిన వాళ్ళ మాటకేంగానీ నాకీ సిద్ధమునిపైన మాత్రం పీకలదాకా కోపం వుంది. ఇతనికి స్వబుద్ధిలేదు. చెబితే వినడు. మంకుతనం మొదటపుట్టి తరువాత ఇతడు పుట్టి ఉంటాడని నా అనుమానం. సిద్ధమునిని గురించి నీకన్ని వివరాలెలా తెలుసునని అడుగుతారేమో! భలేవారే! మేమిద్దరమూ ఒక ఊరివాళ్ళమే. లేదంటే నేను బాగా చదువుకుని, ఉద్యోగం సంపాదించుకుని టౌనులో సెటిలైపోయాను. అతడేమో పల్లెలోనే అఘోరిస్తున్నాడు.

"సర్లే మీటింగు సంగతట్లా వుండనీ..." అంటూ సిద్ధముని విషయాంతరంలోకి రాబోతుండగా, ఓ కారు రివ్వురివ్వున తూనీగలా వచ్చి మా ఎదుటే ఆగిపోయింది. డ్రయివరు తలుపు తెరిచి పెట్టుకోగా హొటల్ చిత్రలేఖ అధినేత నిరంజన్ బాబు కారులో నుంచి దిగాడు. ఫంక్షను చివర మంత్రులకు మెమొంటోలందజేయబోతున్నవాడు ఆయనే. ప్రముఖులతో ఫొటో దిగే అవకాశంగదా, ట్రిమ్ముగా డ్రస్సై వచ్చాడు. అసలే అందగాడు. అలంకరణలో గ్రీకు హీరోలా మెరిసిపోతున్నాడు.

నిరంజన్ బాబుతో నాకు పరిచయం లేదు. కాని అతడి కారు డ్రయివరు బషీరుద్దీన్ నాకు తెలిసినవాడే. ఆ వీధి చివర అతడి కాపురం.

"ఏమండీ మేష్టరుగారూ! ఇక్కడ కూర్చున్నారేం? లోపలికి వెళ్ళలేదా?" అని పలకరించాడు బషీరుద్దీను.

"బాగా చెప్పావులే! చీమదూరడానికైనా సందుంటేగదా! కుర్చీకిద్దరు చొప్పున కూచున్నా సగం మంది జనం నిల్చునే వున్నారు. ద్వారాల దగ్గర తొక్కిసలాట చెప్పతరంగాదు. చూచే ప్రాప్తం ఎలాగూ లేకపోయింది. మాటలైనా వినొచ్చుగదా అని ఇక్కడ కూచున్నాను" అన్నాను.

"అంతేలెండి! మనోరంజని వాళ్ళ ఫంక్షనా, మజాకానా! ఒకరికిద్దరు మంత్రులు వస్తున్నారాయె! చాలనిదానికి సినిమావాళ్ళుండనే వుండిరి. తేరుకు తిరణాలకు వచ్చినట్టు జనమెందుకురారండీ? ఇంకా రాకపోతేనే ఆశ్చర్యపడాలి కాని" అని అటూ ఇటూ పరకాయించి చూచిన బషీరుద్దీను ఎర్రటోపీల సంరంభాన్ని గూడా గుర్తించి "పరవాలేదులెండి బందోబస్తు బాగానే ఏర్పాటైనట్టుంది" అంటూ సంతృప్తి వెలిబుచ్చాడు.

"ఇంతకూ నేనొచ్చిన పనేందో నువ్వడగలేదే!" శివపూజలో జొరబడే ఎలుగుబంటిలా నా ధ్యాసనంతా కలచివేస్తూ అడిగాడు సిద్ధముని.

"నీ పనేమిటో నాకు తెలియదా! ఎప్పుడూ వుండేదేగదా! ఊరుకో, ఊరుకో కార్యక్రమం ప్రారంభమై పోయినట్టుంది" అంటూ విసుక్కున్నాను.

"మముగన్న మాతల్లి! ఓ తెనుగురాణి! మమ్మేలుకోవమ్మా, నిత్య కళ్యాణి..."

ప్రార్థన మొదలైంది. మెచ్చికోలుగా తల ఊపుతూ అడిగాడు బషీరుద్దీను ఎవరండీ పాడేది?"

ఏమండీ, నాకు తెలియక అడుగుతాను. ఎవరండీ పాడేది? అనే ప్రశ్నలో నవ్వడానికేమైనా వుందా? ఆ మాత్రం మాటకు టైరులోనుంచీ గాలి తీసేసినట్టు కిసుక్కున నవ్వే వ్యక్తిని గురించి ఏమనుకోవాలి? ఆ పెద్దమనిషి ఎవరోగాదు. నాకు చేరువలోనే ఒక బెంచీపైన కూర్చున్న హైస్కూలు తెలుగు పండితుడు. కొంచెం పద్యాలుగూడా వెలగబెడతాడనుకోండి. వరదరాజపంతులు. మాసిన గడ్డం. తలకు కవచంలాగా తెల్లటి జుత్తు. అందులో ముడికందని నాలుగు వెంట్రుకల పిలక. చత్వారపు అద్దాల క్రింద పిల్లికళ్ళు. పొడుం సాహచర్యంతో ఇరుమిక్కిలిగా తోస్తున్న బొంగ్రముక్కు. ఈ వాలకానికి తోడూ అసందర్భంగా ఓ నవ్వుగూడానా! నాకు ఒళ్ళు మండుకొచ్చింది.

"ఎందుకండీ నవ్వుతున్నారు?" తెల్లబోతూ అడిగాడు బషీరుద్దీను.

"మరేంలేదు. ఇదివరకొకసారి ఇదే ప్రశ్నను విన్నాన్లెండి! ఆ విషయం జ్ఞప్తికొచ్చింది. ఒకసారి హైదరాబాదులో గొప్ప సభలు జరిగాయి. అందులో ప్రార్థనాగీతం ఆలపించడానికి ఒక మాజీ సినిమా నటిని కొన్ని మైళ్ళ దూరంనుంచీ విమానంలో రప్పించారు. బ్రహ్మాండమైన హొటల్లో బస ఏర్పాటు చేశారు. ఈ దేశపు మట్టిపైన కాలు పెట్టాల్సిన అవసరం లేకుండా కారుగూడా కుదిర్చారు. అంతా రాయల్ ట్రీట్‌మెంటు. స్టేజిపైన

నిలబడి ఆమె పాడుతుండగా ప్రక్కనే కూచున్న శ్రీకాకుళమాయన నన్నిలాగే అడిగాడు. ఆ పాడేదెవరండీ? అని!"

"తప్పేముంది? అడిగేవుండొచ్చు. అయితే అప్పుడుగూడా మీరిలాగే నవ్వేశారా ఏమిటి కొంపదీసి?"

"నవ్వాను నాయనా! అయితే అది ఏడవలేక నవ్వడం. ఎందుకంటారా, ఆమె పాడుతుండగా వేల లెక్కలో వున్న సభాసదులు విని, ఆనందపారవశ్యం చెందుతుండగా, ఆ పాట రాసిన కవి మాసిన గుడ్డలతో, రేగిన తలతో, వాడిపోయిన ముఖంతో, దిక్కూ మొక్కూ లేకుండా బికారివాడిలా సభాస్థలంలో తిరుగుతున్నాడు."

"కావచ్చు. అయితే ఏమిటి? ఇంతకూ ఏమిటండీ మీరు చెప్పేది?" ఒక చేతజుత్తు పట్టుకుని, ఇంకొక చేతితో ఒరలోనుంచీ కత్తిని లాగినంత తీక్షణంగా నేనన్నాను." అంత నికృష్టంగా వున్న వ్యక్తిని కవి అని ఎవరైనా ఎలా అనుకుంటారు? ఇంకా నయం! ఇదేమిటో పెక్యూలియర్ కేసులా వుందని పోలీసులు పట్టుకపోయారు కాదు. అందుకు సంతోషించాలి మీరు!"

వేడిగా నాలుగు మాటలు వడ్డించడమై పోయింది గనుక, అంతటితో అతడి ఉనికిని విస్మరించడానికి ప్రయత్నిస్తూ నేను బషీరుద్దీను వైపు తిరిగాను. "పాడే అమ్మాయి ఎవరని అడిగావు గదూ! ప్రతాప్ సుందర్జీలేదూ, గ్రూప్ థియేటర్ల ఓనరు, ఆయన మనవరాలు మణిమాల. 'మనోరంజని' కార్యక్రమాల్లో ప్రార్థన ఈమెదే! వాళ్ళింటి హాల్లోకి వెళ్ళి చూడాలి నువ్వు. ఫోటోల గాలరీయేననుకో! తమిళనాడు గవర్నరు, మైసూరు మేయరు, మాజీ ఐ.జి. యిలా ఎందరో! ఒక్కొక్క ఫోటోలో ఒకరిదగ్గర అమ్మాయి బహుమతి స్వీకరిస్తూ వుంటుంది..."

"అయితే ఒకటుందోయ్... బొట్టూ కాటుకా బెట్టి పిలిచినట్టు కలుగజేసుకున్నాడు వరదరాజం పంతులు. "మా స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి వుంది. పూర్వజన్మలో ఏ గంధర్వ లోకాలకో చెందివుంటుందని నా నమ్మకం. శాపవశాన భూలోకానపుట్టి వుండొచ్చు. ఆ అమ్మాయి ఎప్పుడైనా మా స్కూల్లో పాడితే రోడ్డుపైన ట్రాఫిక్కు స్తంభించిపోతూ ఉంటుంది. కానీ ఏం లాభం? ఆ పిల్ల తండ్రి ఓ రిక్షావాలా..."

మళ్ళీ పానకంలో పుడక! అయితే నేనతడి మాటల్ని చెవి ఒగ్గి వినదలచుకోలేదు.

కానీ చెవిలో జోరీగలా కాపురం పెట్టడానికి వచ్చిన సిద్ధముని మాటేమిటి? అతడు సందు చూచుకుని విజృంభించేశాడు. "విసుక్కున్నా విదిలించిపారేసినా ఈసారి నిన్ను వదిలిపెట్టేది లేదు. నా అవసరం అటువంటిది. నేను మిట్టన పడేదీ, లేందీ తేలిపోయే టైమొచ్చేసింది. మడిలో బావి తవ్వే పని పెట్టుకుంటి. అయిదారు వేలు మట్టిలో పోస్తి. ముప్పై అడుగుల లోతులో బండొచ్చేసింది. బండ పగలగొట్టి నీళ్ళు కళ్ళ జూస్తేనే నాకు బతుకు. నాయన్నాయనా! నీకు పుణ్యముంటుంది. ఎట్లయినా ఒక రెండువేలు సర్దాల..."

నాకతడి వైఖరిని ఎలా నిరసించాలో తోచలేదు. తృణీకరించి పారేసినట్టుగానే అడిగాను "ఇప్పుడెంతుంది నీకప్పు?"

"ఎంతో ఎక్కడ్లే? ఇరవైకి లోపే!"

"ఈ అప్పంతా ఎలా తీర్చాలని నీ ఉద్దేశం?"

"దాందేముంది! బావిలో నీళ్ళు పడితే రెండేండ్లలో కొట్టి పారెయ్యనా?"

"అంతేగానీ నేను చెప్పినట్టు చెయ్యవు?"

సిద్ధముని నోటికి తాళంపడింది. చిక్కిబిక్కరించినట్టుగా అతడు దిక్కులు చూడసాగాడు. విషయం తెలిస్తే, నేనుపయోగించింది తిరుగులేని మంత్రమని ఎవరైనా ఒప్పుకోవలసిందే! బుద్ధిహీనుడైపోయాడుగానీ, లేకపోతే ఈ పాటికెప్పుడో లక్షాధికారి కావలసిన వాడే సిద్ధముని. ఎలా జరిగిందో తెలియదు. సిద్ధముని కుటుంబానికి మూడు తరాలుగా ఒక సిద్ధవైద్యం సంక్రమించింది. చాపకిందికి నీళ్ళొచ్చినట్టుగా శరీరంలోకి చొచ్చుకొచ్చి నిస్సత్తువతో, అజీర్తితో మనిషిని క్రుంగదీసి, చివరకు అంతం కళ్ళ జూచే భయంకరమైన జబ్బు పచ్చకామెర్లు. ఇంగ్లీషులోనైతే జాండీస్. పెక్కు సందర్భాల్లో అలోపతీ వైద్యానికి సైతం లొంగని ఈ జబ్బు పైన సిద్దముని కుటుంబంవాళ్ళ చిట్కా వైద్యం అమోఘంగా పనిచేస్తుందన్న అభిప్రాయం ఒకటి జనంలో వేర్లు దన్నుకపోయింది. ఆదివారాల్లో మాత్రమే జరిగే ఈ చికిత్స కోసం వచ్చే రోగులతోను వాళ్ళను తీసుకొచ్చే అప్తులతోను ఆ రోజున మా వూరి బస్సులు కిటకిటలాడిపోతాయి. చేత మణికట్టుచుట్టూ ఒక వాతవేసి, మూలికలతో చేసిన మందేదో ఇచ్చి ప్రతిఫలంగా రెండు రూపాయలు పుచ్చుకుంటాడు సిద్ధముని. రేటు పదిరూపాయలకు పెంచితే ప్రతివారమూ ఎంతలేదన్నా వెయ్యి రూపాయలు చేతికొచ్చే పని! అప్పుడు వెయ్యికీ, రెండువేలకు దేబరించవలసిన పనే వుండేదిగాదు!

"చూడవోయ్ సిద్ధమునీ! నీ పొలాలు మార్ట్‌గేజిలో, తాకట్లో. నువ్వేమో కొత్త అప్పులకోసం వీధుల్లో. నేను చెబుతున్నా నువ్వ తలక్రిందులుగా హఠం పట్టినా అప్పులు మాత్రం పుట్టవు. ఉన్నదొకటే ఉపాయం! మందుకు రేటు పెంచు, జబ్బులొచ్చిన వాళ్ళు పిచ్చి వాళ్ళకింద లెక్క. పదికాదు ఇరవై అన్నా వెనుకాడరు. విసరిపారేసి వెళ్ళిపోతారు" అన్నాను.

"అయ్యో అదెట్లా కుదుర్తుంది? మనం పెట్టిన ఖర్చుకన్నా ఎక్కువగా పుచ్చుకోగూడదే! అలా పుచ్చుకుంటే వైద్యం ఫలించదుగదా? ఇది గుర్వాజ్ఞ!" అన్నాడు సిద్ధముని.

ఇంతలో తప్పుకోండి, అంటూ కొందరు పెడబొబ్బలు పెడుతుండగా, జన సమూహాన్ని చీల్చుకుంటూ ఓ ఆటో కాంపౌండులోకి వచ్చి, నిట్టూర్చినట్టుగా ఆగిపోయింది. నలుగురైదుగురు వ్యక్తులు దాని దగ్గర మూగి, నిలువెత్తు పుష్పహారాన్ని పదిలంగా వెలుపలికి తీయసాగారు.

"అమ్మో ఎంత పూలదండో! ఎవరికండీ ఇది?" బషీరుద్దీన్ ఆశ్చర్యపడిపోతూ అడిగాడు.

"నవయుగ హీరో చైతన్య ప్రదీప్ వేదికపైన వున్నాడు గదయ్యా! ఎవరికి అని అడిగే నీ అజ్ఞానానికి మందే లేదే! తలవంచని హీరోకు ఇది 'మనోరంజని' వాళ్ళ ప్రేమకానుక!" సగర్వంగా వెల్లడించాను.

"మంచిదే, మంచిదే!" ముక్తాయించాడు వరదరాజపంతులు.

"ఇదైనా మంచిదేనని ఒప్పుకున్నందుకు చాలా సంతోషం!" అంటూ నేను రుసరుసలాడి పోయాను.

"ఒప్పుకోకేం చేస్తాను సార్! 'రంగభూమి' సినిమాలో షావుకార్లనుంచి దోచుకున్న డబ్బును హెలీకాప్టరులో నుంచీ నిరుపేదల వాడల్లో చల్లిందెవరు? 'మృగరాజు' సినిమాలో ఒక అబలను రక్షించడంకోసం పాతికమంది గూండాలతో నిస్సహాయంగా పోరాడిందెవరు? 'సర్కస్‌డేరా' చిత్రంలో పులినోట్లో తలదూర్చిందెవరు? అదంతా నటనే గదా అని కొందరు పనికిమాలిన వాళ్ళు అనుకోవచ్చు. వీరోచిత కృత్యాల కితాబును 'డ్యూప్'కు అంటగట్టొచ్చు. పట్టుమని పది వాక్యాలు చెప్పి మెప్పించిన సన్నివేశం ఎక్కడైనా వుందా అని ఆరాతీయవచ్చు. ఈయన మహానటుడు కావడానికి వెనుక దర్జీ పాత్ర ఎంత? మేకప్‌మెన్ నైపుణ్యమెంత? గాయకుడి తోడ్పాటెంత? దర్శకుడి పూనిక ఎంత? అని కొందరు శస్త్ర చికిత్సకు గూడా దిగొచ్చు. ఎవరేమనుకున్నాసరే, నా మట్టుకు నాకు మాత్రం హీరో అంటే చైతన్య ప్రదీపే హీరో! వేర్వేరు నాటక పోటీల్లో పాల్గొని నటనకు ఏడు మొదటి ప్రైజులు కొట్టేసిన మన ఊరి బడుద్దాయి కామేశం నవయుగ హీరోగారి ముందు బలాదూరని చెప్పడానికి నేనే మాత్రం సందేహించను."

మెడకాయమీద నా తలకాయ ఎందుకో గిర్రున తిరుగుతున్నట్టు తోచింది. పంతులు అనే ఈ వ్యక్తి నాతో ఆషాఢభూతిలా వ్యవహరిస్తున్నాడని ఇట్టే గ్రహించేశాను. నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించే బాబత్తు మనిషితో మనకెందుకు లెమ్మని తటాలున లేచి దూరంగా వెళ్ళిపోయాను. అపశృతులు వినిపించకుండా వుండాలని జాగ్రత్తపడుతూ హాల్లోకి దారితీసే ఎత్తయిన సోపాన పంక్తుల్లో ఒక ఖాళీచోటు చూచి కూర్చున్నాను.

కళ్ళు మూసుకుని మైకులో వినవస్తున్న ప్రసంగాలను వింటూ వుండిపోయి, కొద్ది నిమిషాల తర్వాత కళ్ళు తెరిచి చూదును గదా క్రింద మెట్టు దగ్గర నా పాదాల ముందల, బ్రహ్మంగారి దగ్గర సిద్ధయ్యలా ఆసీనుడైపోయి వున్నాడు సిద్ధముని.

మంత్రులకూ, సినిమా నటులకు సన్మాన పత్రాలు సమర్పించడమైంది. చందన పుష్పతాంబూల సహితంగా దుశ్శాలువల ప్రదానం జరిగింది. మెమొంటోలు బహూకరించారు. అభినందిస్తూ కొందరు ప్రసంగించారు. సన్మానితులు ప్రత్యుత్తరాలిచ్చే కార్యక్రమం ఉత్కంఠభరితంగా, ఆనందకోలాహలంగా కొనసాగింది. చివరకు అధ్యక్షుల వారు 'వందన సమర్పణ' అన్నారు.

ఆ మాట వెలువడిందో లేదో జనం ఎక్కడివారక్కడ పాయలుగా చీలి ప్రహరీ గేటుగుండా బయటికి వెళ్లిపోసాగారు.

సంరంభం కాస్తా తగ్గిన తర్వాత సన్మానితులు, కార్యకర్తలు, పురప్రముఖులు పోలీసు బందోబస్తులో వచ్చి వరుసగా సోపాన పంక్తులపైన నిల్చున్నారు. గ్రూప్ ఫోటో తీయడం కోసం ఫొటోగ్రాఫరు వాళ్ళనొక పద్ధతిగా నిల్చోబెట్టడంలో సతమతమైపోతున్నాడు. వెళ్ళిన వాళ్ళు వెళ్ళిపోగా మిగిలిన జనం ఇంకా వాళ్ళను కవచంలా కమ్ముకునే వున్నారు.

సిద్ధముని ఎందుకో చివాలున లేచి నిల్చున్నాడు. ఎటో పరుగెత్తడానికి ఉంకిస్తున్నట్టుగా తోచడంతో నేనతడి చేతిని నా పిడికిలిలో గట్టిగా బంధించేశాను. "ఉండుండు మంత్రులెట్లా వుంటారో నేను జూడనే లేదు. ప్రదీపు, ప్రదీపు అనే ఆయన్నుగూడా సినిమాల్లో చూడ్డమే. వదిలి పెట్టు. ఒకసారి చూసేసి వచ్చేస్తాను" అంటూ గింజుకోసాగాడు సిద్ధముని.

"భలేవాడివేలే! వదిలిపెడితే నువ్వేదైనా అఘాయిత్యం చేయవని ఏం నమ్మకం? కెమేరా కద్దం తగలడంవల్ల నీ పూర్తి శరీరంగానీ, లేక అందులో కొంత భాగంగానీ గ్రూప్ ఫోటోలో పడిపోతే మళ్ళా అదెందుకైనా పనికొస్తుందా? అంతగా వుబలాటముంటే రేపటి దినపత్రికలు కొనుక్కో. వాటిల్లో ఫోటోలుంటాయి. చూచి ఆనందించు" అని ఆపైన ఒక క్షణంగూడా ఆలస్యం చెయ్యకుండా అతణ్ణి చరచరా రోడ్డుపైకి లాక్కెళ్ళిపోయాను.

ఒక మహదవకాశం చేజారిపోయినందుకు, పాపం సిద్ధముని ముఖం చింతాక్రాంతైపోయింది. అతడు మాటిమాటికి వెనుదిరిగి కనిపించినంతవరకు మనోరంజని హాలువైపు చూస్తూనే వున్నాడు.

♦ 'ఈనాడు' ఆదివారం అనుబంధం – *1987* ♦